క్లుప్తంగా

మసీదుల్లో ప్రార్థనలు

అశ్వారావుపేటరూరల్: పవిత్ర రంజాన్ మాసం ఆరంభం కాగా, తొలి శుక్రవారం కావడంతో మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని వినాయకపురం కాలనీ, ఆసుపాక, గుమ్మడవల్లి, మామిళ్లవారిగూడెం, కొత్తూరు, అశ్వారావుపేటలో ఉన్న జూమ మసీదు, రింగ్ సెంటర్, డ్రైవర్స్ కాలనీ, నందమూరినగర్ వద్దగల మసీదుల్లో ముస్లిం సోదరులు నమాజ్ పాటించారు. తొలి శుక్రవారం కావడంతో మసీదులు కిటకిటలాడాయి. సాయంత్రం సమయంలో మసీదుల్లో ఇఫ్తార్ (ఉపవాస దీక్ష విరమణ) పాటించారు. అలాగే రాత్రి ఇషా నమాజ్ తర్వాత ప్రత్యేక తరావీ నమాజ్ చేశారు.

న్యాయం చేయాలి

ములకలపల్లి: ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో హోటల్ నిర్వహిస్తున్న ఒంటరి మహిళ, ఆమె కొడుకుపై దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఆదివాసీ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సదరు మహిళను పరామర్శించి, ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొందరు వ్యక్తులు హోటల్‌లోకి చొరబడి. కూల్‌డ్రింక్ సీసాలు పగులగొట్టడంతోపాటు, మహిళ కొడుకుపై చేయి చేసుకోవడం దారుణమన్నారు. పోలీసులు కేసు నమోదు చేయాలని, బాధిత మహిళకు న్యాయం చేయాలని అన్నారు. ఆదివాసీ సంఘాల సమన్వయకర్త సోయం కన్నరాజు, భద్రాచలం ఆదివాసీశక్తి సభ్యురాలు కోంఢ్రు సుధారాణి, సత్యనారాయణ, చిన్నారి,ముక్తేశ్వరరావు, పద్మ, ప్రభాకర్ ఉన్నారు.

బాలికలను వేధిస్తే కఠిన చర్యలు

అన్నపురెడ్డిపల్లి: బాలికలు, విద్యార్థినులను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం షీ టీం ఎస్సై రమాదేవి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పోషణ పక్వాడా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ట్రాఫికింగ్, పోక్సో, సెక్సువల్ అబ్యూస్‌పై విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఐసీడీఎస్ సిబ్బంది విద్యార్థులకు చిరుధాన్యాల అవశ్యకతను గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గంగాజలం, అరుణ, హెచ్ఎం రవీంద్ర రెడ్డి, ఏఎస్ఐ ప్రసాద్, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌పై కేసు ఉపసంహరించుకోవాలి

అశ్వారావుపేట: రాహుల్ గాంధీపై కేసు ఉపసంహరించుకోవాలని టీపీసీసీ సభ్యుడు జేష్ట సత్యనారాయణ చౌదరి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక రాజకీయాలు పరాకాష్టకు చేరుకున్నాయని విమర్శించారు. ఈనెల 26న వైరాలో జరుగు బహిరంగసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సొసైటీ డైరెక్టర్ బత్తిన పార్థసారథి, అనంతారం సర్పంచ్ దాసరి నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ రద్దు సరికాదు..

భద్రాచలంటౌన్: సూరత్ కోర్టు తీర్పును సాకుగా చూపిస్తూ రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడం అనైతిక అప్రజాస్వామిక చర్య అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రావులపల్లి రాంప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. గతంలో ఇటువంటి సంఘటనలు అనేకం జరిగాయాని తీర్పు వెలువడిన 24 గంటల్లో పార్లమెంటరీ వ్యవస్థ ఇలా నిర్ణయం తీసుకోవడం ఇదే మొదటి సారి అని అన్నారు. ఇది పూర్తిగా బీజేపీ కక్ష్య సాధింపు చర్యగా భావించాలిని అన్నారు. ఇటువంటి చర్యలతో బీజేపీ మనుగడకే ప్రమాదమన్నారు.

జయప్రదం చేయాలి

మణుగూరురూరల్: ఈ నెల 26న ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గంలో కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి అధ్యక్షతన జరిగే హాత్ సే హాత్ జోడోయాత్ర, భారీ బహిరంగ సభలను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్‌రావు, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి రాహుల్ చౌదరి, నజీమ్ జావిద్‌లు పాల్గొంటారని, కావున మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నాయకులు గురిజాల గోపి, కంప రవి, ఎండి.షరీఫ్, మోహన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మెచ్చాకు వినతి

ములకలపల్లి: డీఆర్‌డీఏ సెర్ప్‌లో విధులు నిర్వహిస్తున్న వీఓఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. తాటిసుబ్బన్నగూడెంలోని స్వగృహంలో శుక్రవారం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నరాటి ప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మెచ్చాను కలిసిన వీఓలు తమ సమస్యలను విన్నవించారు. వీఓలకు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యను సీఎం కేసీఆర్‌కు నివేదించాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు దాసం కనకలక్ష్మి, దుర్గ, జ్యోతి, లక్ష్మీకుమారి, పెద్దులమ్మ, వెంకటమ్మ, సత్యావతి, విజయ్. సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

జీపీలకు జాతీయ పురస్కారాలు

ఆయా మండలాల పరిధిలోని పలు పంచాయతీలకు జాతీయ పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందాయి. 2021-22 సంవత్సరానికిగాను.. దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ పురస్కార్‌కి ఎంపికైన పంచాయతీలకు ఈ అవార్డులు అందాయి. 9 అంశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ అవార్డులకు ఎంపికలు జరిగాయి. ఆయా ప్రాంతాల్లోని రైతు వేదికలు వంటి స్థలాల్లో కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఎంపికైన సర్పంచ్‌లు, కార్యదర్శులకు స్థానిక ప్రజాప్రతినిధులు అవార్డులను ప్రదానం చేశారు. సర్పంచ్‌లు, సెక్రటరీలు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వాపురం: అవార్డులు, ప్రశంసా పత్రాలతో 17 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు



ములకలపల్లి: సర్పంచ్, కార్యదర్శికి మెమెంటో అందజేస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత



పినపాక: జాతీయ అవార్డులు అందజేస్తున్న ఎంపీపీ గాంధీ, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు



అన్నపురెడ్డిపల్లి: సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎంపీపీ సున్నం లలిత, జెడ్పీటీసీ భారత లాలమ్మ



దుమ్ముగూడెం: సుబ్బారావుపేట సర్పంచ్, ఎంపీటీసీ, కార్యదర్శులకు సన్మానం



చండ్రుగొండ: అధికారులను సన్మానిస్తున్న సర్పంచ్‌లు



మణుగూరురూరల్: సర్పంచ్‌లు, కార్యదర్శులకు ప్రశంసాపత్రాలు..

అభివృద్ధి పనులకు రూ.5 కోట్లు

మణుగూరురూరల్: పినపాక నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల కోసం మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్) సీఎస్ఆర్ నుంచి రూ.5 కోట్ల నిధులు మంజూరైనట్లు పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీటీపీఎస్ సీఎస్ఆర్ నిధులతో నియోజకవర్గంలోని మండలాల్లో సైడ్ డ్రెయిన్, అంతర్గత రోడ్లు, సీసీ రోడ్లు, కమ్యూనిటి హాల్స్, విద్యుత్ పనులు వంటి అభివృద్ధి పనులను చేపట్టనున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. పినపాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శ్రమిస్తున్నామన్నారు. ప్రతీ పల్లెపైనా దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు, బీటీపీఎస్ సీఅండ్ఎండీ ప్రభాకర్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

సమ్మేళనాలను జయప్రదం చేయాలి..

పినపాక నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాల వారీగా ఏప్రిల్ 2వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరగబోయే బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాలను జయప్రదం చేయాలని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాలకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ 2,9వ తేదీల్లో పినపాక మండలం, 3,4 తేదీల్లో మణుగూరు టౌన్, 5,10 తేదీలలో అశ్వాపురం, 6,11 తేదీల్లో బూర్గంపాడు, 7వ తేదీన ఆళ్లపల్లి, 8వ తేదీన గుండాల, 12వ తేదీన మణుగూరు రూరల్ మండలాల్లో పార్టీ ఆత్మీయ సమ్మేళనాలు జరుగుతాయన్నారు. ఆత్మీయ సమ్మేళనాల్లో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

అందరూ ఐక్యంగా ఉండాలి



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు

భద్రాచలంటౌన్: సమాజంలో కులాలకు అతీతంగా అందరూ ఐక్యంగా ఉండాలని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం భద్రాచలం పట్టణంలో రెడ్డిల సత్రం పక్కన పెరిక సంఘం ఆధ్వర్యంలో సుమారు రూ.7 కోట్లతో నిర్మిస్తున్న పెరిక కుల సదన్ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి తెల్లం వెంకట్రావు, తుళ్లూరి బ్రహ్మయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు చిన్ని, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి, సీపీఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా, ప్రభాకర్ వర్మ, విజయకుమార్, ఎర్రంశెట్టి ముత్తయ్య, ఉమామహేశ్వరరావు, వీర హనుమంతరావు, మోహన్ రావు, శ్రీనివాసరావు, దుర్గాప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు సకాలంలో రుణాలు చెల్లించాలి

మణుగూరురూరల్: మణుగూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ పరిధిలో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించాలని సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం సొసైటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు సొసైటీ ద్వారా పొందిన రుణాలను తిరిగి చెల్లించేలా ఆయా గ్రామాల పరిధి సొసైటీ డైరెక్టర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. సకాలంలో రుణాలు చెల్లించడం వల్ల పొందే రుణ రాయతీలను రైతులకు వివరించాలన్నారు. సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ డి.రామ్మోహన్‌రావు, డీసీసీబీ మేనేజర్ సీతారామయ్య, సొసైటీ డైరెక్టర్లు మాధవి, ప్రసాద్, నాగేశ్వరరావు, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు

ఘనంగా పోషణ్ పక్వాడ



ములకలపల్లి: హైస్కూల్లో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థినులు

ములకలపల్లి: మండలకేంద్రంతోపాటు జగన్నాథపురం, పొగళ్లపల్లి గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. ములకలపల్లిలో జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో దమ్మపేట క్లస్టర్ సీడీపీఓ వి.జ్యోతి పాల్గొని మాట్లాడారు. పోషకాహార అవశ్యకతను, చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరించారు. హెచ్ఎం బాబా, సూపర్‌వైజర్ నాగమణి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు శోభారాణి, శ్రీలత, సుజాత, నాగరాణి. బీబీనాంచారి, రమ్య, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. పొగళ్లపల్లి ఉన్నత పాఠశాలలో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వకృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. సూపర్‌వైజర్ మాధవి, సిబ్బంది పాల్గొన్నారు. జగన్నాథపురం హైస్కూల్‌లో సైకిల్, బైక్ ర్యాలీ చేశారు. సూపర్‌వైజర్ నాగమణి పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: చిరు ధాన్యాల ఆహారం, రక్తహీనతపై శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన, వ్యాస రచన పోటీలను నిర్వహించారు. మండల పరిధిలోని నారాయణపురం, గుమ్మడవల్లి గ్రామాల్లోగల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చిరు ధాన్యాలతో తయారీ చేసిన ఆహారాన్ని తీసుకోవడంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం గ్రామాల్లో మానవహారం నిర్వహించి, బాల్య వివాహాలపై అవగాహన కల్పించి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ రోజారాణి, సూపర్‌వైజర్లు సౌజన్య, పద్మావతి, విజయలక్ష్మి, వరలక్ష్మి, స్వరాజ్యం, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ సుజాత, హెచ్ఎంలు తాటి శ్రీనివాస్, హలవత్ హరిబాబు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

27న వేలం పాటలు

దుమ్ముగూడెం: పర్ణశాల గ్రామపంచాయతీలో ఈ నెల 27వ తేదీన వాహన పార్కింగ్-బోట్ షికార్ వేలం పాటలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ తెల్లం వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డిలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేలంపాటలో ఏజెన్సీ ఏరియా సర్టిఫికెట్ ఉన్న ఎస్టీ కులస్తులు మాత్రమే అర్హులని తెలిపారు. బోట్ షికార్, వాహన పార్కింగ్ కాల పరిమితి 1 ఏడాది మాత్రమే అని, పాటలో పాల్గొనదలచిన వారు 27వ తేదీ మధ్యాహ్నం లోపు రూ.5లక్షలు డిపాజిట్ చేసి పాటలో పాల్గొనాలని సూచించారు. మరింత సమాచారం కోసం పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పంచాయతీ కాంప్లెక్స్‌లో గదులు..

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండ పంచాయతీకి సంబంధించిన జాతీయ రహదారి పక్కన ఉన్న కాంప్లెక్స్ గదులను నేడు కిరాయి నిమిత్తం వేలం వేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఉపేందర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గిరిజన తెగలకు చెందిన వారు రూ.5 వేలు అడ్వాన్స్‌తో ఉదయం పది గంటలకు పంచాయతీ కార్యాలయంలో హాజరు కావాల్సిందిగా ఆయన పేర్కొన్నారు.

మైనార్టీ రుణాలకు ఇంటర్వ్యూలు

అన్నపురెడ్డిపల్లి: మండలంలో మైనార్టీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం అధికారులు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. మండలానికి మంజూరైన రెండు యూనిట్లకు గాను 48 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరయ్యాని, అర్హత కలిగిన వారికి రుణాలను మంజూరు చేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ షబ్బా, ఏపీఎం రాంభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టానికి ఎసరు

బూర్గంపాడు: రైతుబంధు ఇస్తున్నామని ప్రభుత్వం పంటనష్ట పరిహారానికి ఎసరుపెడుతుందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు పున్నంచంద్ ఆరోపించారు. శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో రైతులకు రావాల్సిన రాయితీలను, పంటనష్ట పరిహారాలను పక్కకుపెట్టి ప్రభుత్వం రైతుబంధు జపం చేస్తోందన్నారు. అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గాలి వాన బీభత్సం

అశ్వాపురం: మండలంలో శుక్రవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులకు పలు గ్రామాల్లో చెట్లు నేలకొరిగి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. మొండికుంట గ్రామంలో గాలివాన బీభత్సానికి వర్షా శంఖర్‌కు చెందిన పూరి గుడిసె నేలమట్టమయ్యింది. శంకర్ కుటుంబ సభ్యులు ఇంట్లో ఉండగానే పూరి గుడిసె కూలిపోవడంతో కుటుంబ సభ్యులకు స్వల్ప గాయాలయ్యాయి. మొడికుంట, మల్లెల మడుగు గ్రామాలలో ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి.

టీడీపీ ప్రచారం

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెం గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు తుళ్లూరి ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచిపెట్టి తెలుగుదేశం సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాయిని సంపత్, కంచర్ల జనార్దన్, గడకారి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పరిశీలన

చర్ల: చర్లతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సరఫరాను మిషన్ భగీరథ పథకం ఉన్నతాధికారులు శుక్రవారం పరిశీలించారు. కలెక్టర్ అనుదీప్ అదేశాల మేరకు అధికారులు చర్ల, కలివేరు, కుదునూరు, దేవరాపల్లి తదితర గ్రామాల్లో పర్యటించి తాగునీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించారు. తాగునీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారం కోసం సత్వర చర్యలు చేపట్టనున్నట్లు ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు తెలిపారు. పర్యటించిన వారిలో పథకం గ్రిడ్ ఈఈ సి.నలిని, డీఈ పి.యేసుబాబు, ఏఈ రాము, ఇన్‌ట్రా ఈఈ ఎస్.తిరుమలేష్, డీఈ శ్రీనివాసరావు తదితరులు ఉండగా వీరి వెంట ఎంపీడీఓ బి.రామకృష్ణ, సర్పంచ్‌లు కాపుల కృష్ణార్జునరావు, కుంజా కమల, కారం సమ్మయ్య, శ్యామల పద్మ ఉన్నారు.



తాగునీటి సమస్యపై వివరాలు తెలుసుకుంటున్న మిషన్ భగీరథ పథకం అధికారులు

గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియాలోని గైర్హాజరు ఉద్యోగులకు, క్వార్టర్ల మార్పునకు సంబంధించి శుక్రవారం మణుగూరు ఏరియా జీఎం కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మణుగూరు ఏరియాలోని కేసీయూజీ మైన్‌లో విధులు నిర్వహిస్తూ గైర్హాజరవుతున్న 8 మంది ఉద్యోగులను గుర్తించి వారికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. విధులకు హాజరు కాకపోవడానికి గల కారణాలను తెలుసుకున్నారు. చిన్న చిన్న కారణాలతో విధులకు గైర్హాజరు కావడం వల్ల వేతనాలు కోల్పోవడంతోపాటు ఉత్పత్తి పరంగా సంస్థకు నష్టం కలిగించిన వారవుతారన్నారు. అదే విధంగా మణుగూరు ఏరియాలో సింగరేణి ఉద్యోగులు నివాసం ఉంటున్న పవీకాలనీ ఎంసీ, టీ-2 చెంజ్ ఆఫ్ క్వార్టర్స్ ఎలాట్మెంట్ కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎంసీ, టీ-2 క్వార్టర్స్‌లో పైభాగంలో ఉంటున్న వారు తమ కుటుంబ సభ్యులు అనారోగ్యకారణాలతో 15మంది కింద క్వార్టర్స్ కావాలని కోరుకోవడంతో వారి దరఖాస్తులు పరిశీలించి అర్హత ఉన్న వారి జాబితాను రూపొందించారు. కింద క్వార్టర్ల ఖాళీలు, సీనియారిటీ ఆధారంగా క్వార్టర్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఏరియా ఎస్వోటూ జీఎం డి.లలిత్‌కుమార్, డీజీఎం పర్సనల్ ఎస్.రమేష్, ఏజీఎం సివిల్ డి.వెంకటేశ్వర్లు, టీబీజీకేఎస్ నేత వి.ప్రభాకర్‌రావు, డాక్టర్ సురేష్, సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, వి.రామేశ్వరరావు, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

అశ్వారావుపేటరూరల్: వడ్డెరల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, ఆవాస ప్రాంతాల్లో అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం అశ్వారావుపేట, వినాయకపురం గ్రామాల్లో వడ్డెర ఓబన్న జయంతి వేడుకల సందర్భంగా సంబంధిత సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ఆయన హాజరై జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అశ్వారావుపేటలో వడ్డెర సంఘానికి కమ్యూనిటీ హాల్ భవనం మంజూరు చేస్తామని, వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చే విధంగా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు బండి పుల్లారావు, నాయకులు మందపాటి మోహన్ రెడ్డి, బిర్రం వెంకటేశ్వరరావు, వెంకన్న, ఉప్పల ప్రసాద్, వడ్డెర సంఘం నాయకులు తమ్మిశెట్టి శ్రీను, దేరంగుల ప్రసాద్, దేరంగుల శ్రీను పాల్గొన్నారు.



వినాయకపురంలో జెండా ఆవిష్కరించి, మాట్లాడుతున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

మామిడి తోటల పరిశీలన



నేలరాలిన మామిడికాయలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ నరసింహారావు

మణుగూరురూరల్: మండల పరిధిలోని కొండాయిగూడెం, తిర్లాపురం గ్రామాల్లో గాలిదుమారానికి నష్టం వాటిల్లిన మామిడితోటలను శుక్రవారం మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహరావు సందర్శించి నేలరాలిన మామిడికాయలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తోటల రైతులతో మాట్లాడి.. నష్టం అంచనా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దని, ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పర్యటనల్లో భాగంగా సీఎం కేసీఆర్ పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరంగా ఇవ్వాల్సిన సహాయ, పునరావాస సౌకర్యాలను త్వరితగతిన చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. గాలి దుమారానికి నష్టపోయిన మామిడితోటల రైతులను కూడా అధికారులు గుర్తించి.. వారికి కూడా ప్రభుత్వపరంగా నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముత్యం బాబు, ఏఈఓ వీరేంద్రనాయుడు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, రైతుసమన్వయ సమితి కో ఆర్డినేటర్ వెంకటరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

'పెసా' గ్రామసభ విజయవంతం

ములకలపల్లి: మండలపరిధిలోని సీతారాంపురం జీపీలో శుక్రవారం నిర్వహించిన 'పెసా' గ్రామసభ విజయవంతమైంది. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు మాట్లాడుతూ... గిరిజన చట్టాలను కాపాడేందుకు 'పెసా' గ్రామసభ ఒక్కటే మార్గమని అన్నారు. ఈ సభల ద్వారానే స్థానిక ఆదివాసీ ప్రజల అభివృద్ధి వారి సమక్షంలోనే జరుతుందని అన్నారు. కాగా ఈసభకు మండలస్థాయి అధికారులెవరూ హాజరు కాకపోవడం గమనార్హం.

'పెసా' కమిటీ ఉపాధ్యక్షురాలు కోంఢ్రు పద్మ, కార్యదర్శిపద్దం ప్రభాకర్, కో-ఆప్షన్ సభ్యుడు సడియం రాజేశ్వరరావు, ఈసం ఆదినారాయణ, వర్సా శివకుమార్, స్థానిక ఆదివాసీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

'క్షయ' నిర్మూలనకు కృషి చేయాలి

క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండలాల్లోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ వైద్యాధికారులు సూచించారు. శుక్రవారం క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రాల్లో వైద్య సిబ్బంది ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించారు. మానవహారాలు చేపట్టారు. తద్వారా వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించారు. వక్తలు మాట్లాడుతూ.. క్షయ.. బ్యాక్టీరియా ద్వారా వ్యాపించే అంటువ్యాధి అని, రెండు వారాలకు మించి దగ్గు వస్తుంటే, తెమడ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. – సాక్షి నెట్‌వర్క్



భద్రాచలంటౌన్: జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ రాజశేఖర్ రెడ్డి



బూర్గంపాడు: మోరంపల్లిబంజర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ..



అశ్వారావుపేటరూరల్: గుమ్మడవల్లి పీహెచ్‌సీ వద్ద అవగాహన ర్యాలీ..



ములకలపల్లి: ప్రదర్శన చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది



చండ్రుగొండ: ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది